



వేరుశనగ

సబ్సిడీ ఖరారు

40 శాతం సబ్సిడీ ◆ 90 శాతం ట్రైబల్ ఏజెన్సీలకు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ విత్తనకాయల సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. సాధారణ రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వగా, ట్రైబల్ రైతులకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించారు. కె-6కిలో సేకరణ ధర రూ.93 కాగా, కదిరి లేపాక్షి (కె-1812) రకం రూ.83గా నిర్ణయించింది. వీటికి 40 శాతం సబ్సిడీ ఇచ్చారు. దీని ప్రకారం కె-6కు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ప్రకారం కిలోపైన రూ.37.20 ఇవ్వనుంది. రైతు చెల్లించాల్సింది కిలోపై రూ.55.80గా ఉంది. అదే ట్రైబల్ ఏజెన్సీల్లోని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ ప్రకారం కిలో రూ.9.30 చెల్లిస్తే సరిపోతుంది. ఇక కదిరి లేపాక్షి రకం 40 శాతం సబ్సిడీ ప్రకారం రూ.49.80 రైతు చెల్లించాలి. ట్రైబల్ ఏజెన్సీల్లో రైతులు 90 శాతం సబ్సడీ ప్రకారం రూ.8.30 కిలోకు చెల్లించాల్సి ఉంటుంది.

గరిష్టంగా మూడు బస్తాలు

వేరుశనగ విత్తనకాయలకు సంబంధించి 30 కిలోల ఒక బస్తా చొప్పున పంపిణీ చేయనున్నారు. అర ఎకరానికి ఒక బస్తా, ఆపైన ఒక ఎకరా వరకు అయితే రెండు బస్తాలు, ఒక ఎకరాపైన ఉన్న రైతులకు మూడు బస్తాలు గరిష్టంగా ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఖరీఫ్‌లో విత్తన పంపిణీకి సంబంధించి కేటాయింపులను ప్రభుత్వం జరిపింది. అనంతపురం జిల్లాకు 78245 క్వింటాళ్ల కేటాయించారు. సత్యసాయి జిల్లాకు 100907 క్వింటాళ్లు ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనం కింద పంపిణీ చేయాలని నిర్ణయించారు.

పంపిణీ ఎప్పుడో .?

వేరుశనగ విత్తనకాయలను సాధారణంగా మే నెలలోనే పంపిణీ చేపట్టేవారు. కాని ఈసారి సేకరణ ధరయే ఇప్పుడు ఖరారైంది. ఇప్పుడు సేకరణ ప్రారంభించి ఎప్పటికి పంపిణీ జరుగుతుందన్నది చూడాల్సి ఉంది. గతంలో లాగా మన విత్తనం సొంత విత్తనం కింద కూడా రబీలో విత్తనకాయలు ఇవ్వలేదు. పూర్తిగా ప్రయివేటు వ్యాపారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు కూడా ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవడంతో నాన్ సబ్సిడీ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత నేరుగా ఆగ్రామాలకు విత్తనకాయలను అందజేయడం జరుగుతుంది. ఇప్పటికే వర్షాలు కూడా పడుతుండటంతో రైతులు దుక్కులు దున్నుకునే పనిలో ఉన్నారు. జూన్ మొదటి వారంలో మరోమారు మంచి వర్షాలొస్తే విత్తనం విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. అంతలోపు విత్తన పంపిణీ ప్రారంభమయితే రైతులు సకాలంలో విత్తనం వేసుకుంటారు.

సంక్షోభంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

- ◆సోషలిజమే ప్రత్యామ్నాయం
- ◆నాడు మార్క్స్ చెప్పిందే నేడు రుజువు అవుతోంది..
- ◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ◆అనంతలో 'ప్రపంచ ఆర్థిక మాంద్యం- ప్రజలపై ప్రభావాలు' సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభాల మయమని నాడు కారల్ మార్క్స్ చెప్పారని, అదే నేడు రుజువు అవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-ప్రజలపై ప్రభావాలు' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కమ్యూనిజానికి కాలం చెల్లింది... కాలంతోపాటు మారాలి అని చెప్పే వారికి ఇప్పుడు పరిస్థితులు ఎవరు మారాలన్నది స్పష్టం చేస్తున్నాయని గుర్తుచేశారు. మారాల్సింది కమ్యూనిస్టులు కాదు... పెట్టుబడిదారులన్నది స్పష్టమవుతోందని చెప్పారు. నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది తెలిపారు. ప్రపంచం ఆర్థిక వ్యవస్థలో కీలకంగా చెలామణి అవుతున్న డాలర్ విలువనే ఇప్పుడు రోజురోజుకూ పడిపోతోందని వివరించారు. దీన్ని కాపాడుకోలేని స్థితిలోకి అమెరికా వెలుతోందన్నారు. రెండు వందల సంవత్సరాల క్రితమే కారల్ మార్క్స్ ఈ సమాజలోని అంతరాలు, బాధలకుగల కారణాలను పరిశోధించి తర్కించి సమాజంలోని అంతర్గత సూత్రాన్ని గ్రహించి సమాజ గమనానికి మూల కారణం శ్రమ అని తెలియజేసారని గుర్తుచేశారు. ఈ శ్రమ ద్వారానే సంపద సృష్టించబడుతోందని చెప్పారు. అయితే ఇది కొద్ది మంది పెట్టుబడిదారీ చేతుల్లోకే వెలుతోందన్నారు. దీనికి మద్దతుగా పాలకులు ఉంటున్నారని పేర్కొన్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా శ్రమజీవులు ఏకమై పోరాడినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని వివరించారు. కారల్‌మార్క్స్ చెప్పిన ఈ సూత్రానికి అనుగుణంగా ప్రజలను సమైక్యపరచి దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ నేడు ప్రపంచాన్ని సంక్షోభం పట్టి పీడిస్తోందని చెప్పారు. ఇది కమ్యూనిస్టులు చెబుతున్న మాటకాదని, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ఐక్య రాజ్యసమితి వంటి సంస్థలే చెబుతున్నాయని గుర్తు చేశారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధియే స్తంభించిపోతుందని ఆయా సంస్థలే ప్రకటిస్తున్నాయని తెలిపారు. 2023 అక్టోబరు నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తారా స్థాయికి చేరుతుందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షులే ఇటీవల ప్రకటించారని చెప్పారు. ప్రపంచంలో సుమారు 70 దేశాల్లో ఇది మరింత తీవ్రంగా ఉండే అవకాశముందని ఆర్థిక నిపుణులు సైతం అంచనా వేస్తున్నారన్నారు. ఈ సంక్షోభాలతో ఉపాధి మరింత మందిగించడమే కాకుండా ఉన్న ఉపాధిని కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయన్న అంచనాలు వేస్తున్నారన్నారు. దేశంలో సుమారు నాలుగు కోట్ల మంది నిరుద్యోగులవుతారన్న కూడా చెబుతున్నారన్నారు. ఇంతటి తీవ్రమైన సంక్షోభాలకు కారణం ఆర్థిక వ్యవస్థలోనున్న లోపాలే కారణమని చెప్పారు. ఇదే విషయాన్నే నాడు మార్క్స్ తన సిద్ధాంతం ద్వారా తెలియజేసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, చంద్రశేఖర్, రిటైర్డు డిఆర్ఓ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

కళ్యాణమస్తు, షాదీతోఫా సాయం...

486 మందికి రూ.3.61 కోట్లు

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద 486 మంది లబ్ధిదారులకు రు.3.61 కోట్ల ఆర్థిక సహాయాన్ని పెళ్లి కుమార్తె తల్లులు ఖాతాలకు జమ చేసినట్లు కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. కళ్యాణమస్తు, షాదీతోఫా పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం నాడు కలెక్టరేట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా కింద పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు ఆడపిల్లలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని చెప్పారు. జిల్లాలో ఈ పథకం ద్వారా కులాంతర వివాహాలు 71 మంది, ఒకే కులంలో వివాహం చేసుకున్నవారు 405 మంది ఉన్నారన్నారు. మొత్తం 486 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ ఛైర్ పర్సన్ మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఉమాదేవి, నగర మేయర్ మహమ్మద్ వసీం, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్ రెడ్డి,డిటీడబ్ల్యూఓ అన్నాదొరై, పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు వారికి చెప్పదెబ్బ

రౌడీయిజం చేస్తామంటే తోకలు కత్తిరిస్తాం : మంత్రి రోజా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రోజా

పేదలకు ఇళ్ల స్థలాలివ్వడంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు విపక్షాలకు చెప్పుదెబ్బ వంటిదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా ఘాటుగా విమర్శించారు. అనంతపురం నగరంలో పిస్తాహౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాజధాని స్థలంలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని వైసిపి ప్రభుత్వం ఆలోచిస్తే దాన్ని చంద్రబాబునాయుడు ఇవ్వకుండా అడ్డుపడే ప్రయత్నం చేసారని విమర్శించారు. ప్రజా రాజధాని అని అధికారంలో ఉండగా చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. ఆ రాజధానిలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలివ్వకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతిపక్షాలకు చెప్పుదెబ్బ వంటిదని ఎద్దేవా చేశారు. రాజధాని భూముల అవినీతిపైనా విచారణ జరగకుండా స్టే తెచ్చుకున్నారని, దానిపైనా ఇప్పుడు విచారణకు న్యాయస్థానం అనుమతినిచ్చిందని చెప్పారు. చంద్రబాబునాయుడు ఆయన అనుయాయులు పెద్దఎత్తున ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారన్నారు. అవన్నీ విచారణలో బయటకు రానున్నాయన్నారు. ఇక చంద్రబాబుకు అన్నీ రివర్సు జరుగుతున్నాయని, త్వరలో వాటిపై జైలుకెళ్లి చిప్పకూడు తినక తప్పదని పేర్కొన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఇప్పుడు రైతులకు ఏదో మంచి చేస్తున్నట్టు ప్రకటనలు ఇస్తున్నారన్నారు. రైతులకు అండగా ఉన్నది వైసిపి ప్రభుత్వమని చెప్పారు. ఏ సీజన్‌లో పంట దెబ్బతింటే అదే సీజన్‌లో రైతులకు పరిహారం అందివ్వటం జరుగుతోందన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలలో రూ.1900 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీనివ్వడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ఇళ్ల వద్దకే వచ్చి పంట కొనడం, అమ్మడం చేయడం జరుగుతోందని వివరించారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల అండ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బుక్కరాయసముద్రం : ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని సిద్ధరాంపురం, కొండాపురం, కొత్తపల్లి పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించి కూలీను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం ఒక వరం లాంటిదన్నారు. ఈ చట్టాన్ని నమ్ముకుని సుమారు నాలుగు లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఇలాంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి సమ్మర్ అలవెన్స్‌తోపాటు అదనపు వేతనాలను రద్దు చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కూలీలు పని చేసే చోట టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు, పనిముట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎ.నాగలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అనంతపురం : దుకాణదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్ హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని పత్తి, మిరప విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి, ప్రత్తి విత్తనాలను నిర్ణీత ధర కన్నా అధిక ధరకు అమ్మకూడదన్నారు. డీలర్లు ఎవరూ నకిలీ విత్తనాలు అమ్మకూడదన్నారు. అలాగే రైతు సోదరులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు తప్పక పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సులు కీలకం

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

అనంతపురం : నిర్మాణ రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ కోర్సులు చాలా కీలకం అని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియులోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హల్‌లో భారత ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ అధికారులతో విసి అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సహకారంతో జెఎన్‌టియులో ఎం.టెక్‌లో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ (బ్రిడ్జి, టన్నెల్) కోర్సును ప్రారంభించే విధానంపై చర్చించారు. ఈసందర్భంగా వాఉరు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఎం.టెక్ ప్రోగ్రాంలో ఈకోర్సును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రవేశానికి ఎపి.పీజీ సెట్ 2023 పరీక్షల్లో అర్హత సాధించిన వారికి అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఈకోర్సులో చేరాలనుకునే వారు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, స్పెషల్ ఆఫీసర్ పి.ఆర్. భానుమూర్తి మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ టన్నెల్ రహదారుల శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సారంగి, డైరెక్టర్ కాంత్జా పాల్గొన్నారు.

8 నుంచి సమ్మర్ క్యాంప్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో పనిచేస్తున్న గ్రంథాలయాలలో ఈ నెల 8 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులు, పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎమ్.గౌతమి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డిలు ఆవిష్కరించారు. సమ్మర్ క్యాంపులో పిల్లలకు డ్యాన్స్, వకృత్వం, వ్యాసరచనం తదితర పోటీలను నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ తెలిపారు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.రమ, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యం



సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

- ◆ వైద్యశాఖలో 49 వేలకు పైగా సిబ్బందిని నియమించాం
- ◆ జిల్లాలో మెడికల్ కాలేజీ విస్తరణ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధికి సహకారం అందిస్తాం
- ◆ రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేస్తోందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. శుక్రవారం ఆమె అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ గిరిజమ్మతో కలిసి అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణుల విభాగాలను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలపై రోగులతో ఆరా తీశారు. ఆసుపత్రిలో ఎంవోటీ ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. అటునుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజావైద్యం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో వైద్యులు ఇంటింటికీ వెళ్లి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ చేపట్టే ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. 49 వేల మందికి పైగా వైద్య సిబ్బంది నియామకాలను చేపట్టడంపై ఇతర రాష్ట్రాలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయన్నారు.

17 మెడికల్ కళాశాలల మంజూరు

దేశంలో ఎక్కడా లేని విధంగా 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించామన్నారు. వాటిలో ఐదు కాలేజీలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు, బోధన తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం కాలేజీలలో అడ్మిషన్లకు అనుమతులు వచ్చాయని, రాజమండ్రి మెడికల్ కాలేజీకి సైతం అనుమతి దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రి దృష్టికి పలు సమస్యలు

అనంతపురం సర్వజన ఆసుపత్రి అభివృద్ధి, సమస్యలను అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురం సర్వజన ఆసుపత్రికి ఇతర జిల్లాల నుంచి సైతం రోగులు వస్తుంటారన్నారు. నిత్యం దాదాపు 2000 మంది ఓపీ సేవల వద్ద ఉండే పరిస్థితి ఉందన్నారు. రద్దీకి అనుగుణంగా సర్వజన ఆసుపత్రి సామర్థ్యం 550 పడకలకు, ఎంసీహెచ్ బ్లాక్ సామర్థ్యం 600 పడకలకు, ఏఎంసీ సామర్థ్యం 200 పడకలకు పెంచాల్సి ఉందన్నారు. క్యాజువాలిటీని సైతం 75 పడకలకు పెంచాలన్నారు. మెడికల్ కాలేజీ విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో అవయవదానం చేసేందుకు యువత ముందుకు వస్తోందని, అలాంటి దాతల వివరాల సేకరణ, అవయవాలు భద్రపరచడం, అత్యవసర రవాణా వంటి సేవలు సూపర్ స్పెషలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎమ్.గౌతమి, ఏపీఎంఎస్ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డీఎంఈ సత్యవర ప్రసాద్, సూపరింటెండెంట్ రఘునందన్, డిఎంహెచ్ఓ వీరబ్బాయి, ఆర్డీవో మధుసూదన్ పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న విప్ కాపు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

జిల్లా ఛైర్‌పర్సన్‌గా మరోమారు కాపు భారతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. ఛైర్‌పర్సన్‌గా కాపు భారతి మరోమారు ఎన్నికయ్యారు. అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న రెవెన్యూ భవన్‌లో శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు నిర్వహించగా జిల్లా కోఆపరేటివ్ అధికారి ప్రభాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ముందుగా 13 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. వారిలో కాపు భారతి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా మల్లికార్జున, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కాపు రామచంద్రారెడ్డితో పాటు మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రతి మూడేళ్లకోసారి రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు జరుగుతాయి. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం 2026 మే 5వ తేదీ వరకూ కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. నంద్యాల, తిరుపతి జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర పరిశీలకులు ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. కాపు భారతి ఎన్నికపై స్థానిక వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపు ఛైర్‌పర్సన్ పదవి అని వారు అభివర్ణించారు.

శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాయదుర్గం : పట్టణ శివారులోని మల్లాపురం లే అవుట్, గౌడ లేఅవుట్, బిటిపి లేఅవుట్, ఎంసీపి లేఅవుట్, భంభం స్వామి లేఅవుట్‌లలో సిసి రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాయదుర్గం పట్టణానికి చుట్టూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు, ముఖ్యంగా మున్సిపల్ యంత్రాంగం విఫలం చెందారని విమర్శించారు. మున్సిపల్ అధికారులకు ఆ కాలనీల్లో ఇంటి, నీటి పన్నులు కట్టించుకోవడంపై ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంపై లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. డ్రైనేజీ కాలువలు లేక వర్షం నీరు ఇళ్ల ముందర నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని, తద్వారా ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని తెలిపారు. ఇకనైనా పాలకులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.. అప్పటికీ అధికారులు స్పందించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు.

నేరాల శాతాన్ని తగ్గించాలి : ఎస్పీ

గార్లదిన్నె : మండలంలో నేరాల శాతాన్ని తగ్గించాలని ఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం శింగనమల, గార్లదిన్నె మండలాల్లోని తరిమెల, నాగలగుడ్డం, ఇల్లూరు, కల్లూరు గ్రామాల్లో ఎస్పీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కక్షలు, కొట్లాటలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించాడు. ఇందులో భాగంగా కేసుల వివరాలను ఎస్ఐ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఎక్కువగా పెట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట శివారెడ్డి, సిఐ అన్సార్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన : ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-పుట్లూరు

పేదరిక నిర్మూలనకు చదువు ఒక్కటే దివ్యాస్త్రమని భావించిని ముఖ్యమంత్రి జగన్ ఆదిశగా అనేక పథకాలను తీసుకొచ్చారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగరాజుకుంట, రంగమనాయునిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికం అనే చీకటిని చదువు అనే వెలుగుతో తరిమేయవచ్చన్నారు. అందుకే జగనన్న చదువు కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. అలాగే ఇంటికి దీపాలైన మహిళల కోసం 90 శాతం పథకాలను తీసుకొచ్చారన్నారు. అయితే దుష్టచతుష్టయం మాత్రం జగన్‌పై అనేక ఆరోపణలు చేస్తోందన్నారు. అలాంటి మాటలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, సింగిల్‌విండో ప్రెసిడెంట్, ఎంపీటీసీలు, సర్పంచి రామంజులరెడ్డి, మండల కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే ప్రతి ఒక్కరినీ అభినందించాలని ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఉరవకొండలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో సెపక్‌తక్రా క్రీడాకారులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు మల్లయ్య జ్ఞాపకార్థం కుమారుడు ఆమిద్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న మారుతి జిల్లాలో ఉన్న 15 సెపక్‌తక్రా క్లబ్బులకు బాళ్లు, నెట్‌లు, క్రీడా దుస్తులతోపాటు ఫిట్నెస్ సామగ్రి పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడాకారులు కూడా ఇలాంటి అవకాశాలను వినియోగించుకుని క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు మొరార్జీయాదవ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నజీర్, రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, గౌరవ సభ్యులు గణేష్‌బాబు, నాగేశ్వరావు, ప్రభాకర్ నాయుడు, శ్రీధర్, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉరవకొండ ఐకెపి సిబ్బందిపై ఎమ్మెల్సీ ఆగ్రహం

ప్రజాశక్తి-ఉరవకొండ

కొన్ని మహిళా సంఘాల గ్రూపుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని పట్టణంలోని వైకెపి సిబ్బందిపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు కొందరు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన శుక్రవారం నేరుగా ఉరవకొండ ఐకెపి కార్యాలయానికి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ తాము సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించినప్పటికీ డబ్బు చెల్లించలేదని ఆసరా పథకం ఇవ్వలేదన్నారు. అంతేగాకుండా ఇష్టారాజ్యంగా యానిమేటర్లను తొలగిస్తూ కొత్తవారిని నియమించుకుంటున్నారని వాపోయారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ ఐకెపి సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తోంటే అధికారులు మాత్రం ఇలా నీరుగార్చడం మంచిది కాదన్నారు. కొంతమంది కింది స్థాయి సిబ్బంది వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. 15 రోజుల్లో మహిళా సంఘాల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తాని హెచ్చరించారు.



ఉరవకొండ ఐకెపి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆప్తాలమిక్ అసిస్టెంట్ సఫియా కోరారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల ఆరోగ్య ఉపకేంద్రంలో వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ, ఎంఎల్‌హెచ్‌పిలు భవాని, భారతి, ఎఎన్ఎంలు కోమల, హెల్త్ అసిస్టెంట్ ముకుందర్, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్ల ఏర్పాటు

రాయదుర్గం : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 151 గ్రామాల్లో ప్రభుత్వ వ్యయంతో సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ డివిజన్ అధికారి నిశాంత్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో 151 గ్రామాల్లో రీ సర్వే చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా తొలివిడతగా 33 గ్రామాల్లో ప్రభుత్వ వ్యయంతో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల సరిహద్దులను తెలుపుతూ ప్రభుత్వ వ్యయంతో సర్వే రాళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే రాళ్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులదే అన్నారు.

కమనీయం.. నారసింహుని కల్యాణం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం మంత్రోచ్ఛారణల మధ్య కమనీయంగా సాగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యం, వేద పండితులు హరిప్రసాద్, భరద్వాజ్ స్వామికి సుప్రభాతసేవ, పంచామతాభిషేకం, బలిహరణ పూజలు చేశారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి కల్యాణ క్రతువు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిప్పేస్వామి, కోశాధికారి నరసింహులు, సత్యనారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, సభ్యులు కమలాక్షుడు, గుర్నాథరెడ్డి, రామిరెడి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

కళ్యాణదుర్గం : స్థానిక హిందూపురం రోడ్డులోని ఆర్టీసీ స్థలాన్ని వ్యాపార సముదాయాల కోసం లీజుకు ఇస్తున్నట్లు డిపోమేనేజర్ మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2.47 ఎకరాల భూమిలో 40 అడుగుల రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు ఈ నెల 23వ తేదీ లోపు టెండర్ దాఖలు చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం డిపో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. గ్రామానికి చెందిన క్రీడాకారులు, యువకుల ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయ స్వామి టెన్నిస్ బాల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. టోర్నీని రాయచోటి సీఐ ఎన్.కృష్ణయ్యయాదవ్, వైసీపీ సీనియర్ నాయకులు ఎన్ సి. రంగయ్య యాదవ్ ప్రారంభించారు.

పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే 'అనంత'కు లేదు

అనంతపురం : జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి లేదని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు కలవడం అత్యంత సహజం అన్నారు. ఇందులో భాగంగానే టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిశారన్నారు. వీరు కలిస్తే వైసిపి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. పవన్‌కళ్యాణ్ ఎవరి పల్లకీ మోయడానికి సిద్ధంగా లేరని, ప్రజలను భక్షించుకుతింటున్న వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకే నడుం బిగించారన్నారు. తమ అధ్యక్షులు తీసుకునే నిర్ణయానికి జనసైనికులందరూ కట్టుబడి ఉంటారన్నారు. మరోసారి ఎమ్మెల్యే అనంత అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No: 98/2016 in O.S. No: 224/2012
Between:-
D. నరేష్ కుమార్ .. డిక్రి హోల్డర్
మరియు
P. మహమ్మద్ రఫీ .. జడ్జిమెంట్ డెటార్
జడ్జిమెంట్ డెటారుకు సేల్ నోటీసు
P. మహమ్మద్ రఫీ, S/o. P. దస్తగిరి, వ్యాపారము, R|o. D.No. 19-168, హనుమేష్ నగర్, గుంతకల్లు టౌను మరియు మండలము, అనంతపురము జిల్లా.
మీ హాజరు నిమిత్తము పై తెల్పిన కేసులో పై తెల్పిన కోర్టు నందు 11-05-2023వ తేది ఉదయం గం|| 10-30 ని||లకు వాయిదా వేసి వున్నారు. కావున మీరు పై తెల్పిన తేదీన స్వయంగా కానీ, లాయరు ద్వారా కానీ హాజరై ఏమైనా ఆక్షేపణలున్న యెడల తెలుపుకోవలెను. అట్లు కానిచో నీ పరోక్షమున కేసును తీర్మానించెదరని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం. శ్రీనివాసులు మరియు బి. లక్ష్మీనారాయణ
న్యాయవాదులు, గుత్తి, అనంతపురము జిల్లా.

భక్తిశ్రద్ధలతో ఉలిగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉలిగమ్మ ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి నిర్వహించిన ప్రత్యేక పూజలు శుక్రవారం ముగిశాయి. అమ్మవారికి ఉదయమే పన్నీటి స్నానమాచరించి మూలవిరాట్‌ను అందంగా అలంకరించి పట్టు వస్త్రాలు, వడిబియ్యం, పసుపు కుంకుమ అర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, బొమ్మనహాల్ ఎంపీపీ ఉమ, జడ్పిటిసి నీలవేణి, వివిధ గ్రామాల ప్రజలు హాజరయ్యారు. భక్తులకు గ్రామస్థులు ప్రసాదం అందజేశారు.

ఘనంగా పిస్తా హౌస్ ప్రారంభం

రుచికరమైన ఆహార పదార్థాలు అందించడం సంతోషం - ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మంత్రి రోజా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని రుద్రంపేట బైపాస్ బెంగళూరు జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన పిస్తా హౌస్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, సినీనటుడు, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారులు అలీ ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా మాట్లాడుతూ జిల్లావాసులకు పిస్తా హౌస్ రుచులు అందించడం అభినందనీయం అన్నారు.

ఆకట్టుకున్న ఆర్‌కెస్ట్రా

పిస్తా హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్‌కెస్ట్రా ఆకట్టుకుంది. హిందీ, తెలుగు సినిమా పాటలు ఆలపిస్తూ ఆహ్వానితులను ఆకట్టుకున్నారు. పిస్తా హౌస్ మేనేజింగ్ డైరెక్టర్లు హర్షద్‌బాషా, సాహిద్ ఇమ్రాన్, హరినాథ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, ఆసీఫ్ బాషా, పిస్తా హౌస్ ఛైర్మన్ మొహద్ అబ్దుల్ అజీద్‌లు అతిథులకు పుష్పగుచ్చాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. వచ్చిన అనంత ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, ప్రజలకు రెస్టా రెంట్ రుచులు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, స్రవంతి వాసంతి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం తదితరులు పాల్గొన్నారు.



పిస్తాహౌస్‌లో రుచులు చూస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, మంత్రి రోజా, సినీనటుడు అలీ, తదితరులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

8న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తిం-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయన్నారు. రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్, మలేరియా, కోవిడ్, గార్బేజ్, క్లాప్ డ్రైవర్స్ , స్కూల్ స్వీపర్స్, అదేవిధంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతోపాటు మున్సిపల్ కార్మికులతో సొంత పనులు చేయించుకుంటున్న రాయదుర్గం శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రయాదవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన నిర్వాకం వల్ల ఓ కార్మికుడు గాయపడిన విషయం తెలిసిందే అన్నారు. కాగా సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేయాలని, హెల్త్ కార్డులు, రక్షణ పరికరాలు, సమాకంలో పనిముట్లు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికుల, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు నివాస గృహాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దుమ్మూ, ధూళి, మురికి, మలినాలు, విషపురుగులు, జంతు కళేబరాల మధ్య విధులను నిర్వహిస్తూ అనేక మంది కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. అలాంటి కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పాలకవర్గం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అనేకమార్లు నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, సమ్మెలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లాపర్యటనకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మీనరసమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, ఉపాధ్యక్షులు బంగ్లా రాఘవేంద్రప్రసాద్, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు జిల్లా నాయకులు ఎజి.రాజమోహన్, యూనియన్ లీడర్లు మాలతి, సుజాత, భారతి, వరలక్ష్మి, జరీనా, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మంచిచేశామనిపిస్తేనే ఓటేయండి : ఎమ్మెల్యే తోపుదుర్తి

ప్రజాశక్తి-ఆత్మకూరు

వైసిపి అధికారంలోకి వచ్చాక మంచి చేశామని అనిపిస్తేనే రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్ఆర్ మూడో విడత ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాదిరి జగనన్న ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం లేదన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నారు. తాను చేసిన మంచి పని చూసి, మావాడు ఉంటేనే ఆత్మకూరు మండలం బాగుంటుందని భావిస్తేనే తనకు ఓటేయాలని కోరారు. తాను ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గానికి 25 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిటాల సునీత పని చేసిన ఐదేళ్లలో కేవలం 1250 ఇళ్లు వచ్చాయని గుర్తు చేశారు. అంతేగాకుండా చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం వర్షాలు వచ్చేవి కావన్నారు. అప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో, ఇప్పుడు ఆయన తనయుడు జగన్ హయాంలో పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. అలాగే పేరూరు డ్యాంకు నీళ్లు రావడంతో ఆరు మండలాల్లో భూగర్భజలాలు పెరిగాయన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా గ్రామాలు పచ్చగా కనిపిస్తూ రైతు సంతోషంగా ఉన్నాడన్నారు. పంట దెబ్బతింటే జగనన్న ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తాడనే ధైర్యం, పంటల బీమా ఇస్తాడనే నమ్మకం ఉందన్నారు. ఇకపోతే మీ అందరి ఆశీర్వాదం, అభిమానంతో డెయిరీ నిర్మాణం పూర్తయి ట్రయల్‌రన్ కూడా సక్సెస్‌గా ముగిసిందన్నారు. త్వరలోనే జగన్ చేతులమీదుగా ప్రారంభించి నియోజకవర్గంలో 10 వేలమంది మహిళా పాడి రైతులకు లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు. జాకీ కంపెనీ ప్రకాష్‌రెడ్డి వల్లే పోయిందని మాట్లాడుతున్న నారా లోకేష్ 2015లో జాకీ కంపెనీకి భూములిచ్చి ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పటికీ ఆ భూమి మీవద్దే ఉందన్నారు. ఆభూమిని తమకు అప్పగిస్తే ఆర్నెళ్లలో గార్మెంట్ ఫ్యాక్టరీ కట్టి చూపుతామని ఛాలెంజ్ విసిరారు. ఈనేపథ్యంలో పథకాలన్నీ కొనసాగాలన్నా.. వలంటీర్ల వ్యవస్థ ఉండాలన్నా.. వర్షాలు కురవాలన్నా.. నియోజకవర్గంలో మూడు రిజర్వాయర్లు పూర్తి కావాలన్నా.. 25 వేల ఇళ్లు పూర్తి కావాలన్నా మళ్లీ జగనన్న కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి హేమలత, సర్పంచి వరలక్ష్మి, నాయకులు బాల పోతున్న, వాసుదేవరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గులి కొండారెడ్డి, అధికారులు మహిళలు, మండల కన్వీనర్లు, జడ్పీటీసీలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఘనంగా గోలకొండ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వెలసిన గోలకొండ వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాతిదూలం లాగుడు, ఇరుసు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీల్లో సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గార్లదిన్నె మండలం కె.రామంజినేయులు ఎద్దులు, రెండో బహుమతి కృష్ణాపురానికి చెందిన నాగేశ్వరరెడ్డి ఎద్దులు, మూడో బహుమతి కృష్ణాపురానికి చెందిన నాగరాజుగౌడ్ ఎద్దులు, 4వ బహుమతి కుందనం కోట గ్రామానికి చెందిన చెన్నప్ప ఎద్దులు, 5వ బహుమతి కల్లుమడికి చెందిన మహేందర్‌రెడ్డి ఎద్దులు సాధించాయి. వీరికి సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి బహుమతులు అందజేశారు. అలాగే ఇరుసు పందేలు కూడా నిర్వహించారు. ఈ పందెంలో పామిడి మండలం వంకరాజుకాలవ గ్రామానికి చెందిన జి.సురేష్ మొదటి బహుమతి సాధించడంతో వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్ బహుమతి అందేశారు. అలాగే రెండో బహుమతి సాధించిన బత్తలపల్లి మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన పోతులయ్యకు వైసిపి కార్యకర్త బాలకృష్ణ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఇరుసు పందెం విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న పట్నం నగేష్

14న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రాముడి శతజయంతి ఉత్సవాలను ఈనెల 14న అనంతపురం నగరంలోని కమ్మభవన్‌లో నిర్వహించనున్నట్లు ఆపార్టీ అనంతపురం పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలవ శ్రీనివాసులు, జి.శ్రీధర్‌చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినీ, రాజకీయ రంగాల్లో మకుటం లేని మహారాజులా దశాబ్దాలపాటు కోట్లాదిమందిని ప్రభావితం చేసిన మహనీయులు ఎన్టీఆర్ అని కొనియాడారు. అంతేగాకుండా పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికార పీఠాన్ని అధిష్టించడంతోపాటు పాలనలో, సమాజంలో అనేక విప్లవాత్మక మార్పులకు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అలాంటి మహానుభావుని శతజయంతి ఉత్సవాల్లో భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పలుపునిచ్చారు.

కల్యాణమస్తు, షాదీతోఫాల నిబంధనలను సడలించాలి

నార్పల : ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను పెట్టిన నిబంధనలను సడలించాలని టిడిపి జిల్లా నాయకులు ఆలం నరసానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫాలకు ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను చూస్తే ఏ జంటకూ ఆయా పథకాలు వర్తించవన్నారు. లబ్ధిదారులను వడపోసేందుకు ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హులందరికీ కల్యాణమస్తు, షాదీతోఫాలు అమలు చేయడంతోపాటు నగదు మొత్తాన్ని కూడా పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, తెలుగు యువత చంద్రబాబు, పిఎల్ లక్ష్మీనారాయణ, నరసాపురం సత్తి, దుగుమర్రి విశ్వనాథరెడ్డి, చంద్రమౌళి, వడ్డే మహేష్, గణేష్, హరీష్, వంశీ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పెద్దపప్పూరు : మండలంలోని తిమ్మనచెరువు గ్రామ సమీపంలో వెలసిన వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా నిర్వహించిన పూజల్లో యువ నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయన వెంట జాతీయ ఉపాధి హామీ పథకం నెంబర్ వేమనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని వ్యక్తి మృతి

అనంతపురం : నగరంలోని జాతీయ రహదారిలో ఉన్న విఆర్‌ఎల్ గోడౌన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పయ్యావుల శ్రీనివాసులునాయుడు (44) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శ్రీనివాసులు తన కుమారుడు గిరితో కలిసి పాఠశాలలో మార్కుల జాబితాను తీసుకునేందుకు వస్తుండగా విఆర్‌ఎల్ గోడౌన్ ఎదురుగా వెనుక వస్తున్న కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో శ్రీనివాసులు(44) అక్కడికక్కడే మతి చెందాడు. బాలుడికి కాలు విరిగిపోయింది. అతివేగంతో వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతోనే ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేత్రదానం

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పయ్యావుల శ్రీనివాసులు నాయుడు నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఆసుపత్రి ఐ బ్యాంకు ప్రతినిధి ప్రదీప్ కళ్లను సేకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నేత్రాలను సేకరిస్తున్న వైద్యులు

నాటుసారా విక్రేతపై కేసు నమోదు

గుత్తి : మండలంలోని బసినేపల్లి తండాకి చెందిన నాటుసారా విక్రేత కమలాకర్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ బి.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బసినేపల్లి తండా నుంచి ద్విచక్ర వాహనంలో గుత్తికి పది లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా దాడి చేయగా కమలాకర్‌నాయక్ సారాను వదిలి పరారైనట్లు తెలిపారు. ఈమేరకు నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గో వాహనంపై విహరించిన లక్ష్మీనరసింహుడు

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలం వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం స్వామివారు గో వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా వేకువజామున నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శ్రీవారు మాడవీధుల్లో ఊరేగించారు. వాహనసేవ తదుపరి పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయకుమార్, ఆలయ అర్చకులు ద్వారకానాథ్‌స్వామి, బాలాజీ స్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కులు అందజేత

అనంతపురం క్రైం : జిల్లాలో ఇటీవల మృతిచెందిన రెండు పోలీసు కుటుంబాలకు కార్పస్ ఫండ్ కింద విడుదలైన రూ.2 లక్షల చెక్కులను ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆయా బాధితులకు శుక్రవారం అందజేశారు. ఎస్ఐ బి.నరసింహులు, ఎఆర్ కానిస్టేబుల్ సురేష్ ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలకు మంజూరైన చెరో రూ.లక్ష చెక్కులను ఎస్పీ తన ఛాంబర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, జిల్లా పోలీసు పరిపాలనా అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న టిటిసి దరఖాస్తు గడువు

అనంతపురం సిటీ : టిటిసి కోర్సు చదివేందుకు దరఖాస్తు గడువు శనివారంతో ముగియనున్నట్లు పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకునేవారు నేడు సాయంత్రి 5గంటలలోపు చేసుకోవాలన్నారు. తర్వాత ఎలాంటి గడువు పొడిగించమన్నారు.

6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యాడికి : మండలంలోని మోడల్ పాఠశాలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మారుతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 25వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రు.75, ఒసి, బిసి విద్యార్థులు రూ.150 రుసుం చెల్లించాలన్నారు. మే 11న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విద్యాధికారిణి శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.వెంకటేశులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శింగనమల ఇఒఆర్‌డి బదిలీ

శింగనమల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒఆర్‌డి విధులు నిర్వహిస్తున్న శివనారాయణరెడ్డి బదిలీ అయ్యారు. ఈయన సత్యసాయి జిల్లా పెనుగొండకు పదోన్నతిపై డిఎల్‌పిఒగా బదిలీ అయినట్లు ఎంపిడిఒ నిర్మలాకుమారి తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

రాయదుర్గం రూరల్ : వాహనం నడిపేటప్పుడు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆర్‌టిఓ విశ్వనాథరెడ్డి సూచించారు. స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఆర్టీవో ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ వేగం చాలా ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనదారులతో రోడ్లలో రద్దీ ఎక్కువైందన్నారు. వాహన చోదకులు రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు కిరణ్, వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకష్ణ గోవర్ధన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి

గుత్తి : శిథిలావస్థకు చేరుకున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని జనసేన నాయకుడు మణికంఠ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఉన్న రైల్వే వంతెన వద్ద జనసేన నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందన్నారు. బ్రిడ్జిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈనేపథ్యంలో దెబ్బతిన్న బ్రిడ్జితో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

నివాసాలు తొలగించొద్దని వినతి

రాయదుర్గం : రైల్వే పనుల విస్తరణ పేరిట పట్టణంలోని చంద్రబాబు కాలనీలో నివాసాలు తొలగించవద్దని స్థానికులు నాగరాజు, ప్రతాప్, ప్రహ్లాద, గాలప్ప, వెంకటేశులు, షణ్ముఖప్ప, తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ మారుతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, గతంలోనే తహసీల్దార్ నివాసితు లకు ఇళ్ల పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అయితే ఇటీవల కొందరు రైల్వే శాఖ అధికారులు కాలనీ వద్దకు వచ్చి ఈ స్థలం రైల్వే శాఖకు చెందిందని వెంటనే ఖాళీ చేయమని హెచ్చరించి వెళ్లారని వివరించారు. తాజాగా రైల్వే శాఖకు చెందిన కొందరు కాలనీ వద్దకు వచ్చి సర్వే చేసి ఈ స్థలాలను ఖాళీ చేయాలని చెప్పారని వాపోయారు. రైల్వే పనుల విస్తరణ పేరిట తమ పొట్ట కొట్టరాదని, రైల్వే శాఖకు అవసరమైన స్థలాన్ని రైల్వే స్టేషన్‌కు ఉత్తర దిక్కున ఉన్న ప్రభుత్వ, కొండ, పోరంబోకు, ప్రయివేటు భూముల నుంచి సేకరించాలని వారు కోరారు.